క్లుప్తంగా

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం బుధవారం రాత్రి శోభాయమానంగా జరిగింది. శ్రీమాన్ శ్రీచిత్రకవి శ్యాము ఆచార్య రామానుజస్వామి గరుడాళ్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామ వైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వ పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు గరుడ వాహనంపై పట్టణ రైల్వే స్టేషన్ పురవీధుల్లో దర్శనమిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఏకాంత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గరుడ ముద్ద, తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఏకాహం



నకరికల్లు: స్థానిక కొండపై వెలసిన స్వయంభూ చెంచులక్ష్మీ ఆదిలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రారంభించిన ఏకాహం గురువారం ముగిసింది. అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. విశేష ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. శ్రీ నరసింహ, జయ నరసింహ, శ్రీ నకరికంటి లక్ష్మీ నరసింహ ఏకాహం 24 గంటల పాటు నిరంతరాయంగా జరిపించారు. పౌర్ణమి పురస్కరించుకొని శివకేశవుల గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడు

పెదకూరపాడు: రోజు స్కూల్‌కు వెళ్లి మధ్యలో ఎందుకు వస్తున్నావు.. ఇలాగైతే బడి మానేసి మీ అమ్మతో వ్యవసాయ పనులకు వెళ్లు అని.. తండ్రి మందలించాడని కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని లగడపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్‌ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన కొమరాబత్తిన సుధాకర్, రత్నకుమారిలకు 13 ఏళ్ల వయస్సు ఉన్న సంతోష్‌కుమార్ మండలంలోని గారపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 11వ తేదీన స్కూల్‌కు వెళ్లినట్లే వెళ్లి తిరిగి రావడంతో తండ్రి సుధాకర్ రోజు స్కూల్‌కు వెళ్లకుండ ఇలా చేస్తున్నావు. లేకపోతే మీ అమ్మతో కలసి వ్యవసాయ పనులకు వెళ్లు అన్ని మందలించడంతో అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు.

గుడిపాడును సందర్శించిన తహసీల్దార్



క్రోసూరు: మండలంలోని గుడిపాడు గ్రామాన్ని గురువారం తహసీల్దార్ వీవీ నాగరాజు సందర్శించారు. ఇటీవల గ్రామం నుంచి ఇరువురు వ్యక్తులు పీజీఆర్ (ప్రజా సమస్యల గ్రీవెన్స్ ఫోరం) లో అందచేసిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారించేందుకు తహసీల్దార్ వచ్చారు. గ్రామానికి చెందిన హసన్ అనే వ్యక్తి తన తండ్రికి ఇరువురు భార్యలున్నారని, రెండవ భార్య కుమారుడు తన తండ్రికి చెందిన పొలం 69 సెంట్లు తనకు చెందాలని కోరుతుండగా, మొదటి భార్య పిల్లలు కూడా తమకు కావాలంటున్నారని తెలిపాడు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఇరువురు మాట్లాడుకుని ఒక అంగీకారానికి వచ్చి తనను కలవాలని కోరారు. అదే విధంగా గ్రామానికి బషీరున్ బీ తన తండ్రి 1977లో కొనుగోలు చేసిన పొలాన్ని తన పెళ్లిలో కట్నం కింద రిజిస్ట్రేషన్ చేశారని, అయితే తన పొలాన్ని వేరొకరు సేల్ అగ్రిమెంట్‌పై రిజిస్ట్రేషన్ చేయించుకుని పొలం తనదంటూ పేచీ పెడుతూ కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. దీనిపై తహసీల్దార్ కోర్టు తీర్పును బట్టి పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట వీఆర్వో మస్తాన్ వలి, అర్జీదారులున్నారు.

తాగునీటికి కటకట

- వారం నుంచి రాని రక్షిత మంచినీరు
- వేసవికి ముందే వెతలు
- ఒకేసారి మరమ్మతుకు గురైన మోటార్లు
- 14 గ్రామాల్లో నీటి ఎద్దడి



మరమ్మతులకు గురైన మోటార్లు



మినరల్ వాటర్ పోసే వాహనం

పెదకూరపాడు: వేసవికి ముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత వారం రోజులుగా పెదకూరపాడు మండలంలోని 14 గ్రామాల్లో తాగునీరు, వాడుకునేందుకు నీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. కృష్ణానది వద్ద కస్తల నుంచి నేరుగా మోటార్ల సహాయంతో బుచ్చియ్యపాలెం సామాజిక రక్షిత మంచి నీటి పథకం ద్వారా మండలంలోని 14 గ్రామాలకు వచ్చే నీరు రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కస్తల వద్ద ఉన్న మోటార్లు ఒక్కసారిగా మరమ్మతులకు గురవడంతో నీటి ఎద్దడి ఏర్పడింది.

మినరల్ వాటరే దిక్కు

రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు రాకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్‌ను నమ్ముకున్నారు. ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి ప్రత్యేక వాహనంతో మంచినీరు అమ్ముతున్నారు. దీంతో పెదకూరపాడు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు 200 లీటర్ల నీటిని రూ.150కు కొనుగోలు చేస్తున్నారు. పెదకూరపాడు ఎస్సీ కాలనీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బుచ్చియ్యపాలెం సామాజిక రక్షిత మంచినీటి పథకం నుంచి ఈ కాలనీకి నేరుగా తాగునీరు, వాడుకునేందుకు పైపులైన్ల ద్వారా అందిస్తారు. అసలే వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో తాగునీరు లేకపోవడంతో కొనుగోలు చేయక తప్పడం లేదు.

వాడుకునేందుకు అవస్థలు

రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాడుకునేందుకు కూడా నీరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఒకటి, రెండు పంపులు ఉన్నా అవి పూర్తిగా ఉప్పునీరు కావడంతో దూర ప్రాంతాల్లోని నేల బావులను ఆశ్రయిస్తున్న పరిస్థితి. పెదకూరపాడులోని నేల బావికి కేవలం రెండు గిలకలు మాత్రమే ఉండటంతో ఎక్కువ మంది తెల్లవారుజామున నీటి కోసం రావడంతో వేచి ఉండే పరిస్థితి నెలకొంది.

అన్ని గ్రామాలకు నీటిని అందిస్తాం

కస్తాల వద్ద ఉన్న రెండు మోటార్లు మరమ్మతులకు వచ్చాయి. ముందుగా ఒక మోటార్ బేరింగ్‌లు కాలిపోవడంతో రెండవ మోటారు సహాయంతో నీరు అందించే ప్రయత్నం చేశాం. రెండవ మోటరు కూడా కాలిపోవడంతో నాలుగు రోజుల నుంచి కొన్ని గ్రామాలకు, ఆరు రోజుల నుంచి కొన్ని ప్రాంతాలకు నీరు నిలిచిపోయింది. నరసరావుపేట నుంచి మెకానిక్‌లను తీసుకొచ్చి బాగు చేయిస్తున్నాం. శుక్రవారానికి పూర్తి అవుతుంది. అన్ని గ్రామాలకు నీటిని అందిస్తాం.

– రామారావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పెదకూరపాడు

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

యూనియన్ బ్యాంక్ జిల్లా రీజినల్ హెడ్ మాధురి



పెదకూరపాడు : తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థిక పురోభివృద్ధి సాధించినపుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని యూనియన్ బ్యాంక్ పల్నాడు జిల్లా రీజనల్ హెడ్ మాధురి అన్నారు. గురువారం పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు యూనియన్ బ్యాంక్ పరిధిలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబనపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులు, ఫైనాన్స్ ఏజెన్సీల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని మోసపోవద్దని హితవు పలికారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని చెప్పారు. సకాలంలో రుణాలు చెల్లించే ఎస్‌హెచ్‌జీలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చాలా గ్రూపులు రూ.10 లక్షల లోపు రుణాలతోనే సరిపెట్టుకుంటున్నారని, ఆర్థిక అక్షరాస్యత డ్వాక్రా మహిళతో సాధించినపుడే మహిళా సాధికారత లభిస్తుందని తెలిపారు. ఖాతాదారులను అడిగి బ్యాంకు సిబ్బంది పని తీరును అభినందించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ బుల్లిబాబు, చీఫ్ మేనేజర్ చందన, బ్రాంచ్ మేనేజర్ జ్యోతి, ఆర్డీవో అశ్విన్, ప్రేమ్ కుమార్, జాబీరున్నీసా, సురేష్, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ తగదు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు బాజీ

నాదెండ్ల: వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటే సహించేది లేదని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ చెప్పారు. మండలంలోని తూబాడు గ్రామంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రవేశ పెట్టడాన్ని యావత్తు ముస్లిం సమాజం ఖండిస్తుందన్నారు. తరతరాలుగా ముస్లిం వర్గానికి చెందిన ఆస్తులను ముస్లింలే నిర్వహించుకోవటం సబబని, ఇతరుల చేతుల్లో పెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న నిర్ణయం సహేతుకంకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలతో వక్ఫ్‌బోర్డు హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో కలిశామని ఎన్నికల్లో ప్రకటన చేసిన కూటమి నాయకులు నేడు వక్ఫ్‌బోర్డు బిల్లుపై నోరు మెదపకపోవటం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలకు అనుకూలంగా నిలబడాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ముస్లింల మద్దతు కావాలంటే వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చౌర్యంపై విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

అమరావతి: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగం, సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం మండలంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తనిఖీల అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి, అత్తలూరు, జూపూడి, లేమల్లె, మండేపూడి, లింగాపురం, చావపాడు, ధరణికోట, మల్లాది, ఎన్‌వీపాలెం గ్రామాలలో 36 మంది అధికారులు, 125 మంది సిబ్బంది, 36 బృందాలుగా ఏర్పడి 3,285 సర్వీసుల తనిఖీ నిర్వహించారన్నారు. మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 5 మందికి రూ.9 వేలు, మీటరు ఉండి అక్రమంగా చౌర్యానికి పాల్పడుతున్న 5 మందికి రూ.1.05 లక్షలు, అదనపు లోడు వాడుతున్న 142 మందికి రూ.6.18 లక్షలు మొత్తం రూ.7.32 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. .ఈ సందర్భంగా ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు మాట్లాడుతూ వినియోగదారులందరూ విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు నిర్ధారించుకోవాలని, సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే సంబంధిత సిబ్బందికి రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశపూర్వకంగా తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనించినచో విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. మొదటి సారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెల్లించినచో విడిచి పెడతామని, రెండవసారి తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అపరాధ రుసుం కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీలలో డీఈఈలు మల్లిఖార్జునప్రసాద్, కోటేశ్వరరావు, ఏఈ సతీష్ కుమార్, ఏఈ శివశంకర్, ఆపరేషన్స్ ఏఈ రవి కిరణ్, ఆపరేషన్స్ డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

ప్రతి రైతు యూనిక్ ఐడీ నంబర్ పొందాలి



మాట్లాడుతున్న ఏవో వెంకటనర్సయ్య

రాజుపాలెం: భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఇవ్వడం వలన రైతుకు ఒక గుర్తింపు ఉంటుందని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని నెమలిపురి రైతు సేవా కేంద్రంలో యూనిక్ ఐడీ నంబర్‌పై రైతులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నంబర్ ఇవ్వడం వలన వ్యవసాయానికి సంబంధించిన సేవలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ నంబర్ ద్వారా పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం, పెట్టుబడి సహాయం, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటల బీమా, పంటల రుణాలపై వడ్డీ రాయితీ మొదలైన సేవలు పొందుటకు ఉపయోగపడుతుందని తెలిపారు. కావున ప్రతీ రైతు ఆధార్‌కార్డు, పొలం పాస్ పుస్తకంతో రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించినట్లయితే యూనిక్ ఐడీని క్రియేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ముస్తాక్, భవాని తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని రఘురాంనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల ఆత్మీయ సమావేశం, ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించబోతుందన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇచ్చిన ప్రతి ఒక్క హామీ రానున్న రోజుల్లో అమలు చేస్తామన్నారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్, నాయకులు యెల్లినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, కోమటిదేని శ్రీనివాసరావు, అనుమోలు జయరాం ఉన్నారు.

కాలువలను ఆక్రమించిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి



కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: ఎన్ఎస్‌పీ అధికారుల నుంచి ఎలాంటి ఎన్‌వోసీలు తీసుకోకుండా ములకలూరులోని విజయలక్ష్మి టౌన్‌షిప్‌లో కాలువలపై జరిపిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రజాసంఘాల నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మీ టౌన్‌షిప్ పేరుతో ములకలూరు, గోళ్లపాడు గ్రామాల మధ్య పలు వెంచర్లను వాగులు, పంట కాలువలు, ఎన్ఎస్‌పీ కాలువలు అక్రమించి ఏర్పాటు చేశారని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా వెంచర్లు వేసి వినియోగదారులను సంస్థ నిర్వాహకులు మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంస్థ భాగస్వామిగా ఉన్న పాలడుగు పుల్లారావు చిట్స్ డిపాజిట్‌ల పేరుతో పెద్ద ఎత్తున సంపదను పొగుచేసుకొని పరారయ్యాడని తెలిపారు. విజయలక్ష్మీ టౌన్‌షిప్ చేస్తున్న ఆక్రమణలు, మోసాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు 'పోషణ్ భీ-పఢాయి భీ' శిక్షణ



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ బాలత్రిపురసుందరి



మాట్లాడుతున్న పీడీ ఉమాదేవి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి



స్క్రీన్ ద్వారా వివరిస్తున్న సీడీపీవో శ్రీలత

ఏపీ ఎస్ఐపీసీసీడీ ఆర్‌సీబీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు శిక్షణ

క్రోసూరు: ఐసీడీఎస్ ప్రాజెక్ట్, క్రోసూరు ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు క్రోసూరు జెడ్పీ పాఠశాలలో మూడు రోజుల పాటు పోషణ్ భీ-పఢాయి భీపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్ఐపీసీసీడీ ఆసీబీ ఉమెన్, చైల్డ్ శాఖచే నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా సూపర్‌వైజర్ బాలత్రిపురసుందరి పాల్గొని శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ వర్కర్ల సామర్థ్యాలను మెరుగుపరచి, పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా తరగతులు నిర్వహించేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు, దొడ్లేరు సెక్టార్ల సూపర్‌వైజర్లు మాధవి, మైమున్నీసా, 41 మంది అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే నైపుణ్యాలను పెంపొందించాలి

సత్తెనపల్లి: చిన్నతనం నుంచే చిన్నారుల్లో చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం వంటి నైపుణ్యాలను పెంపొందింపజేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోషణ్ భీ పఢాయి భీ పై గురువారం నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందే అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నపిల్లలకు పెద్దలతో అర్థవంతమైన సంబంధాలను ఎలా కొనసాగించాలో తెలియజేయాలన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను ఎలా నిర్మించుకుంటారు? పాట, నృత్యం, సంగీతం, కళల ద్వారా వారు సంస్కృతితో ఎలా కనెక్ట్ అవుతారో తెలుసుకొని అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సామాజిక భావోద్వేగాలు, సాంస్కృతిక, సౌందర్య, భాష, శారీరకం, కాగ్నిటివ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. శిక్షణలో ఏసీడీపీఓ సంతోష కుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, డీఈవో రూతు రాణి వెన్నాదేవి, రెంటపాళ్ల, కొండమోడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో నాణ్యతను మెరుగుపరచటమే లక్ష్యం

ముప్పాళ్ళ: అంగన్‌వాడీ కేంద్రాలలో విద్య నాణ్యతను మెరుగుపరచటమే పోషణ్ భీ-పఢాయి భీ కార్యక్రమం లక్ష్యమని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఉమాదేవి చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ, మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ముప్పాళ్ళ, ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం పోషణ్ భీ-పఢాయి భీ శిక్షణ కార్యక్రమం జరిగింది. మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాలలో విద్య నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం పోషణ్ భీ-పఢాయి భీ కార్యక్రమం ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోషణపై దృష్టితో పాటు అంగన్‌వాడీ వర్కర్ల సామర్థ్యాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో సూచించిన అంశాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మొదటి రోజు ఆకుకూరల పెంపకం, అంగన్‌వాడీ కార్యకర్తల విధులు, సూపర్‌వైజర్స్‌కు విజిట్‌ల గురించి వివరించారు. సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ సంతోషకుమారి, సూపర్‌వైజర్‌లు అనంతలక్ష్మీ, జి.జయలక్ష్మీ, ఎస్.స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారంతో పాటు ప్రాథమిక విద్యలో నైపుణ్యాలు మెరుగుపరచాలని సత్తెనపల్లి సీడీపీవో పి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పోషణ భీ- పఢాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి బ్యాచ్‌కి శిక్షణ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ నవచేతన ఆదర్శిల అనే కార్యక్రమాలపై వివరించారు. బాల్య ఆరంభ విద్య, సంరక్షణ బలోపేతం చేయడంపై వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 బి.మల్లిఖార్జునశర్మ, ఏసీడీపీవో టి.సంతోషకుమారి, సూపర్‌వైజర్లు ఆర్‌కే రమాదేవి, బి.ప్రసన్నరాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పెదకూరపాడు : 0-6 సంవత్సరాల చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తెలిపారు. గురువారం పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఉమాదేవి మాట్లాడుతూ ఆహారం, ఆరోగ్యం, విద్య, సంరక్షణ, సురక్షనే లక్ష్యాలుగా అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యం బలోపేతం చేసేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు పోషకాహార, ప్రేరణ ఆధారిత ఆటల ఆధారిత, విద్యను అందించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టేట్ మాస్టర్ ట్రైనర్ షేక్ ముని, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడవాహన ఊరేగింపు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం గరుడవాహన సేవ, కోలాటం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు గరుడ వాహనంపై చిన్నారుల కోలాటం మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంచాలి

చిలకలూరిపేట: చిన్నారుల్లో సృజన పెంచేలా అంగన్‌వాడీ టీచర్లు పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డీఆర్‌పీలు జి.విజయకుమారి, ఎస్ భూలక్ష్మి చెప్పారు. మండలంలోని కావూరు గ్రామం జెడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ్‌భీ, పఢాయిభీ కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్ల లోపు బాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తే వారిలో సృజనాత్మకత అలవడుతుందని పేర్కొన్నారు. శిక్షణకు 45 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.

NOTICE

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION):: GUNTUR

I.P No: 15 / 2024

BETWEEN :

Ponnamudi Subba Rao & Another. ...Petitioners

And

Yetra Rami Reddy & Others. ...Respondents

To,

R-21:Darsi Narayanamma, W/o,Not known, R/o.Near Anjaneya Swamy Temple, Nagarjuna Nagar, Sattenapalli, Palnadu Dist.

... ది.28-02-2025 ...

వాయిదా తేది: 28-02-2025

వి. శ్రీలత, పిటీషనర్ల తరఫు అడ్వకేట్, 6/2 అరండల్‌పేట్, గుంటూరు, సెల్.81252 17369

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ముప్పాళ్ళ: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు బ్రాంచి కాలువ లాకుల వద్ద బ్లూ, రెడ్, వైట్ కలర్ గీతలు గల చొక్కా, 30-35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం గుర్తించామని ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు. మృతుని ఎడమ అరచేయి వెనుక, చూపుడు వేలు బొటన వేలు మధ్య భాగంలో ఇ.పవన్ అని పచ్చబొట్టు ఉందని, శరీరం బాగా ఉబ్బి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందని ఎస్సై తెలిపారు. జేసీబీ సాయంతో బయటకు తీసి మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించటం జరిగిందన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఆనవాలు గుర్తించినట్లయితే ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. గ్రామ వీఆర్వో రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.